Office Of The Advisor (Communications)
Govt. Of Andhra Pradesh

# ప్రాధాన్యక్రమంలో

# రహదారి ప్రాజెక్టులు

## నిర్మాణంలో వేగం–నాణ్యత ప్రధానం

## ఆర్ అండ్ బీ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, మే 5 : సాగునీటి ప్రాజెక్టుల తరహాలో రాష్ట్రంలోని రహదారుల ప్రాజెక్టులను ప్రాధాన్య క్రమంలో నిర్దేశించుకుని నిర్ణీత కాలానికి పూర్తయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. వేగంగా రోడ్ల నిర్మాణం పూర్తి చేయడంతో పాటు, వాటి నాణ్యతకు పెద్దపీట వేయాలని చెప్పారు. రాష్ట్రంలోని 4 వేల కి.మీ. రాష్ట్ర రహదారుల నిర్వహణను పైలెట్ ప్రాజెక్టుగా 5 ఏళ్ల పాటు ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని ఆదేశించిన ముఖ్యమంత్రి, దశలవారీగా మిగిలిన రహదారులను అదేవిధంగా ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. శనివారం ఉండవల్లి తన నివాసంలోని గ్రీవెన్స్‌హాల్‌లో రహదారులు, భవనాల శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు.

ఎక్కడా రహదారులపై గుంతలు వుండకూడదని, ఎప్పటికప్పుడు మరమ్మతులు ప్రైవేటు సంస్థలతో చేయించాలని ముఖ్యమంత్రి అధికారులకు చెప్పారు. ఇందుకోసం రూ. 250 కోట్లు కేటాయించాలని సూచించారు. రహదారుల పక్కన వున్న పిచ్చిమొక్కలను, పొదలను తొలిగించాలని, నీరు నిలిచిపోయి రోడ్లు పాడవ్వకుండా అవసరమైన చోట్ల డ్రైనేజీలు నిర్మించాలని అన్నారు. సీసీ కెమేరాలతో రహదారుల నిర్మాణం పర్యవేక్షించి, డ్రోన్ కెమేరాల ద్వారా వాటి స్థితిగతులు పరిశీలించాని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ సమాచారాన్ని వినియోగించుకోవడం ద్వారా రహదారుల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టవచ్చని అన్నారు. నేల తీరు, వర్షపాతం, ట్రాఫిక్ రద్దీ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని రహదారులు నిర్మించాలని చెప్పారు. నత్తనడకన రహదారుల నిర్మాణం చేపట్టే సంస్థలపై చర్యలు తీసుకుంటామని, నిర్దేశిత సమయానికి రోడ్ల నిర్మాణం చేయకుంటే నిర్మాణ సంస్థలను బ్లాక్‌లిస్టులో పెడతామని ముఖ్యమంత్రి హెచ్చరించారు.

రాష్ట్రంలోని జాతీయ, రాష్ట్ర, జిల్లా రహదారుల మొత్తం 53,403 కి.మీ. పొడవున వున్నాయని, వీటిలో జాతీయ రహదారులు 6,401 కి.మీ., రాష్ట్ర రహదారులు 14,722 కి.మీ., ప్రధాన జిల్లా రహదారులు 32,280 కి.మీ. అని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. జిల్లా రహదారుల్లో 4 వరుసల రహదారులు 131 కి.మీ., రెండు వరుసల రహదారులు 2,671 కి.మీ., ఒక వరుస రహదారులు 28,530 కి.మీ. వున్నాయని తెలిపారు. గ్రామీణ రహదారులు, జిల్లా రహదారులతో కలిపి 2014 నుంచి ఇప్పటివరకు 3,660 కి.మీ. ఒక వరుస రహదారులను రెండు వరుసలుగా అభివృద్ధి చేసినట్టు వెల్లడించారు.

ఈ నాలుగేళ్లలో రూ. 4,150 కోట్లతో గ్రామీణ, జిల్లా రహదారులను రెండు వరుసలుగా అభివృద్ధి చేయడం, పటిష్టపరచడం, వారధులు నిర్మించడం చేశామని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. రూ. 528.66 కోట్లతో 2014 నుంచి 2018 వరకు 1,038.88 కి.మీ. గ్రామీణ రహదారులను బీటీ రహదారులుగా అభివృద్ధి పరిచామని చెప్పారు. ప్రధాన జిల్లా రహదారుల్లో 17,244.80 కి.మీ. మేర గుంతలు వుండగా, వాటిలో 16,280.30 కి.మీ. వరకు మరమ్మతులు చేశామన్నారు. మొత్తంమీద ప్రధాన జిల్లా రహదారుల్లో 94.41% గుంతలు లేకుండా మెరుగు పరిచామని చెప్పారు. అలాగే జూన్ 2014 నుంచి మార్చి 2018 వరకు రాష్ట్ర రహదారుల కోసం రూ. 1,422 కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు.

## రహదారులు, భవనాల శాఖకు ముఖ్యమంత్రి నిర్దేశించిన లక్ష్యాలు

1. గ్రామ పంచాయతీల నుంచి మండల కేంద్రాలకు, మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు, మండల కేంద్రాల నుంచి మండల కేంద్రాలకు రహదారులను త్వరితగతిన అనుసంధానించడం.
2. వచ్చే ఐదేళ్లలో నాలుగు వేల కి.మీ. ప్రధాన జిల్లా రహదారుల విస్తరణ చేపట్టడం.
3. శిధిలావస్థకు చేరిన 120 వంతెనలను పునర్‌నిర్మించడం.
4. రహదారి భద్రతా చర్యల్లో భాగంగా, ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకుని రహదారుల నిర్వహణ చేపట్టడం.
5. 2021–22 కల్లా రాష్ట్రంలోని 1,810 కి.మీ రహదారులను రూ. 1,580 కోట్లతో బీటీ రోడ్లుగా అభివృద్ధి చేయడం.
6. ఈ ఏడాది రూ. 500 కోట్లతో 570 కి.మీ. బీటీ రహదారులు నిర్మించాల్సిందిగా ముఖ్యమంత్రి అధికారులకు లక్ష్యాలను నిర్దేశించారు.

## గ్రామీణ రహదారులకు మహర్దశ

గ్రామీణ రహదారుల కోసం 2014 నుంచి ఇప్పటివరకు బడ్జెట్ కేటాయింపులు రూ. 2,748.21 కోట్లు జరుపగా, మొత్తం రూ. 2,103.34 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది.

- 2014–15లో ఖర్చు చేసినది రూ. 459.17 కోట్లు
- 2015–16లో ఖర్చు చేసినది రూ. 425.97 కోట్లు
- 2016–17లో ఖర్చు చేసినది రూ. 572.11 కోట్లు
- 2017–18లో ఖర్చు చేసినది రూ. 646.09 కోట్లు
- 2018–19లో కేటాయింపులు రూ. 948 కోట్లు

## సీలేరుపై వేగంగా వంతెన నిర్మాణం

తూర్పుగోదావరి జిల్లాలోని చింతూరు–మోటు రహదారి నిర్మాణంలో భాగంగా సీలేరు నదిపై 300 మీటర్ల పొడవున రూ. 23.13 కోట్లతో నిర్మిస్తున్న వంతెనను వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. సీలేరు ప్రాజెక్టు దగ్గర విద్యుత్ ఉత్పత్తి నిలిపివేసిన సమయంలో వంతెన పనులు చేపట్టాలని సూచించారు.

## రాష్ట్ర హైవేలకు నెంబర్లు

జాతీయ రహదారులకు నెంబర్లు కేటాయించిన తరహాలో స్టేట్ హైవేలకు SH–01, SH–02.. పేరుతో నెంబర్ల కేటాయింపు పూర్తయ్యిందని, మొత్తం రాష్ట్రంలోని 451 రాష్ట రహదారులకు నెంబర్లు కేటాయించి జాబితా రూపొందించామని అధికారులు తెలిపారు.

## జాతీయ రహదారులపై ప్రత్యేక శ్రద్ధ

2014 నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో 3,688.01 కి.మీ. జాతీయ రహదారుల నిర్మాణం, మరమ్మతులు కోసం రూ. 6,579.53 కోట్లు ఖర్చు చేశామని అధికారులు ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలో జాతీయ రహదారి ప్రాజెక్టులు అయిన నర్సన్నపేట–రణస్థలం 6 వరుసల రహదారి, ఆనందపురం–పెందుర్తి–అనకాపల్లి 6 వరుసల రహదారి, గుండుగొలను–కొవ్వూరు 4 వరుసల రహదారి, అనంతపురం–గిద్దలూరు–గుంటూరు 2 వరసల రహదారి, చిత్తూరు–మల్లవరం 6 వరుసల రహదారి, రేణిగుంట–నాయుడుపేట 6 వరుసల రహదారి, మైదకూరు–బద్వేలు–నెల్లూరు 4 వరుసల రహదారి, కృష్ణపట్నం పోర్టు రహదారి నిర్మాణం పురోగతిని ముఖ్యమంత్రి సమీక్షించారు. 1,054.3 కి.మీ పొడవైన ఈ 8 మెగా ప్రాజెక్టుల నిర్మాణానికి రూ. 20,789 కోట్లు వ్యయం కానుందని వివరించారు. ఈ ఏడాది సుమారు రూ. 6 వేల కోట్ల విలువైన జాతీయ రహదారుల పనులు చేపడుతున్నట్టు తెలిపారు.

మచిలీపట్నం–భీమవరం, మచిలీపట్నం–ఏలూరు రహదారులను జాతీయ రహదారులుగా భారతమాల ప్రాజెక్టు పరిధిలోకి తీసుకువచ్చేలా ప్రయత్నించాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. జాతీయ రహదారుల నిర్మాణానికి తలెత్తే భూసేకరణ ఇబ్బందులు తక్షణం పరిష్కరించాలని చెప్పారు.

## బెంజ్ సర్కిల్ ఫ్లయ్‌ఓవర్ కోసం ట్రాఫిక్ నియంత్రణ

విజయవాడ బెంజ్ సర్కిల్ దగ్గర చేపట్టిన ఫ్లయ్‌ఓవర్ నిర్మాణం వేగంగా పూర్తి చేసేందుకు రాత్రి సమయంలో ఒకవైపున రహదారి ట్రాఫిక్ నిలిపివేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. రాత్రి 11 నుంచి ఉదయం 6 గంటల వరకు రెండు వరుసల రహదారిపై మాత్రమే ట్రాఫిక్ మళ్లించేలా చూడాలన్నారు. ఎక్కడా ట్రాఫిక్ నిలిచిపోకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

## జనవరి కల్లా కనకదుర్గ ఫ్లయ్‌ఓవర్

విజయవాడలో నిర్మిస్తున్న కనకదుర్గ ఫ్లయ్‌ఓవర్ 65% శాతం పూర్తయ్యిందని అధికారులు వివరించగా, ప్రతినెలా పనుల పురోగతిపై నివేదిక ఇవ్వాలని నిర్మాణ సంస్థ సోమా ప్రతినిధులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఎట్టిపరిస్థితుల్లో ఫ్లయ్‌ఓవర్ నిర్మాణం వచ్చే ఏడాది జనవరి 31 నాటికి పూర్తిచేయాలని స్పష్టం చేశారు. ఫ్లయ్‌ఓవర్ నిర్మించే సామర్థ్యం లేనప్పుడు అసలు నిర్మాణ బాధ్యతలు ఎందుకు తీసుకున్నారని సోమా ప్రతినిధులను ముఖ్యమంత్రి ప్రశ్నించారు. నిర్మాణంలో అంతులేని జాప్యం చేస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు వర్షాకాలం వచ్చేలోగా విజయవాడ–హనుమాన్ జంక్షన్ మధ్య జాతీయ రహదారి నిర్మాణంలో నాణ్యత మెరుగుపడేలా చూడాలని అధికారులకు సూచించారు. అనంతపురం–అమరావతి ఎక్స్‌ప్రెస్ వేకు సంబంధించి భూసేకరణ త్వరతిగతిన పూర్తి చేయాలని చెప్పారు.

సమీక్షలో రహదారులు, భవనాల శాఖ మంత్రి సీహెచ్ అయ్యన్నపాత్రుడు, ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సతీష్ చంద్ర, ముఖ్యమంత్రి కార్యదర్శి ఎ.వి. రాజమౌళి, ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ అనిల్ దీక్షిత్ పాల్గొన్నారు.